క్లుప్తంగా

ఆందోళనలు ఉధృతం చేస్తాం

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వం అడ్డదారిలో తెచ్చిన జీఓలను ఉపసంహరించాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని పార్ట్ టైం, కాంట్రాక్ట్ అధ్యాపకులు పిలువునిచ్చారు. దీక్షల్లో భాగంగా 11వ రోజైన మంగళవారం అధ్యాపకులు గోపి, శ్యామ్‌బాబు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రవిబాబు, వీరాంజనేయులు, జగ్జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శాఖలు కేటాయించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే క్యాబినెట్ విస్తరణలో హోంశాఖతో పాటు విద్యా, మైనారిటీ శాఖలను మంత్రులకు కేటాయించాలని పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్, తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ షేక్ అబ్దుల్ రహిమాన్ ప్రభుత్వానికి మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖలకు మంత్రులు ఉంటేనే సంబంధిత ప్రభుత్వ కార్యకలాపాలు, ఉద్యోగులు, ప్రజల సమస్యలు సులువుగా పరిష్కరించబడతాయని చెప్పారు.

సంతాపం

ఖమ్మంవైద్యవిభాగం: పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. మంగళవారం ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు చాంబర్‌లో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఉగ్రదాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ ఎండీ ఖాజా మునిరుద్దీన్ పదవీ విరమణ పొందిన సందర్భంగా మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ.. గత 27ఏళ్లుగా పలు ఆరోగ్య కేంద్రాల్లో మునిరుద్దీన్ అందించిన సేవలు కొనియాడి ఆయన దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నిరోషా, దుర్గ, విష్ణుసింగ్, వైద్యాధికారులు గోలి రమాదేవి, శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్లు తాళ్లూరి శ్రీకాంత్, పద్మ, చంద్రకాంత్, విజయ, భారతి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

నేలకొండపల్లి: నిరంతరం విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు కూసుమంచి ఏడీ కోక్యా నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో లోటల్టేజ్ సమస్యను నివారించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యుత్ సేవలు మరింత మెరుగ్గా పని చేసేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఏఈ కె.రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి..

రఘునాథపాలెం: రాబోయే పంచాయతీ ఎన్నికల దృష్ట్యా బీజేపీ తన కార్యకలాపాలను వేగవంతం చేసినట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ నేతలు పర్యటించి స్థానిక బూత్ అధ్యక్షులను కలిసి సంస్థాగత అంశాలపై చర్చించారు. పార్టీని పంచాయతీస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థులను నిలబెట్టేందుకు సమాయత్తమవుతున్నామని నేతలు తెలిపారు. ఈ పర్యటనలో మండల అధ్యక్షుడు గుత్తా వంశీ, మండల ఇన్‌చార్జ్ మందడపు ప్రభాకర్‌రెడ్డి, బాలాజీ, కేతినేని రవి, కోటేరు మోహన్‌రెడ్డి, రాంబాబు, నాగేశ్వరరావు, నరేష్, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా అంబేడ్కర్ ప్రజా చైతన్య బాట

ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన, భారత రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా అంబేడ్కర్ ప్రజా చైతన్య బాట నిర్వహిస్తామని బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ అన్నారు. సంఘం 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పట్టణంలో కోలాటం డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించి, జెడ్పీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. చైతన్యయాత్రల ద్వారా బడుగు బలహీన వర్గాలను విద్య, వైద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో చైతన్య పరుస్తూ.. విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, రైతు, ప్రజా సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తొలుత కశ్మీర్‌లోని పెహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

పుర'పాలన'.. ఆగమాగం!

కేఎంసీలో పారిశుద్ధ్య కార్మికుల విధులపై ఆరా

- ఇష్టారాజ్యంగా విధుల నిర్వహణ
- పీహెచ్ వర్కర్ల సంఖ్యపై స్పష్టత కరువు
- విధులకు డుమ్మా కొడుతూ జీతాలు తీసుకుంటున్న పలువురు
- వార్డు ఆఫీసర్లకు శిక్షణ లేదనే సాకుతో డీబీలోకి మళ్లీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో ఉద్యోగులు, సిబ్బంది ఎవరెక్కడ పని చేస్తున్నారో కూడా అధికారులకు తెలియని పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు ఒకటి ఆదేశిస్తే.. విభాగాల అధికారులు, క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, సిబ్బంది మరొకటి చేస్తూ కేఎంసీని అదోపాతాలానికి తీసుకెళ్తున్నారు. కేఎంసీ పరిపాలనతో పాటు నగరంలోని పారిశుద్ధ్యాన్ని గాడినపెట్టేందుకు పాలకులు, అధికారులు ప్రయత్నాలు చేస్తుంటే కొన్ని విభాగాల అధికారులు వారి ప్రయత్నాలకు గండికొట్టి తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రధానమైన విభాగాలుగా పేరున్న శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగంలో ఎవరు ఎక్కడ పని చేస్తున్నారో..? తెలియని పరిస్థితి ఉంది. శానిటేషన్‌లో పీహెచ్ వర్కర్లు ఎంత మంది విధులు నిర్వర్తిస్తున్నారో ఆ విభాగ అధికారికే తెలియని పరిస్థితి ఉందంటే పాలన ఏవిధంగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

పీహెచ్ వర్కర్లపై ఆరా..

ఖమ్మం నగరపాలక సంస్థలో పబ్లిక్ హెల్త్ వర్కర్లు ఎంత మంది ఉన్నారు..? వారు ఎక్కడ పని చేస్తున్నారనే వివరాలను కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలుసుకుంటున్నట్లు సమాచారం. ఈ నెల 23న 'సాక్షి'దినపత్రిలో ప్రచురితమైన 'లెక్కకు మించినా.. ఫలితం శూన్యం'అనే కథనానికి స్పందించిన అధికారులు పారిశుద్ధ్య కార్మికులపై దృష్టి సారించినట్లు తెలిసింది. దీనిలో భాగంగా మూడు రోజుల క్రితం పారిశుద్ధ్య విభాగం అధికారిని కమిషనర్ తన చాంబర్‌కు పిలిచి రెగ్యులర్ పీహెచ్ వర్కర్ల సంఖ్యపై ఆరా తీసినట్లు సమాచారం. సదరు అధికారికి కనీసం ఆ వర్కర్లు ఎంతమంది ఉన్నారనేది కూడా తెలియక.. చెప్పడానికి తడబడినట్లు తెలిసింది. ఔట్ సోర్సింగ్ పీహెచ్ వర్కర్లతో పాటు రెగ్యులర్ పీహెచ్ వర్కర్లు ఎంత మంది ఉన్నారు..?, ఎవరు ఎక్కడ పని చేస్తున్నారు..?, వారికి హాజరు నమోదు చేసే జవాన్లు ఎవరు..?, రెగ్యులర్ వర్కర్లు అంతా విధుల్లో ఉన్నారా.. వంటి పూర్తి వివరాలను తనకు అందించాలని కమిషనర్ సదరు అధికారిని ఆదేశించినట్లు తెలిసింది.

మళ్లీ డీబీలోకే..

కేఎంసీలో కీలకమైన ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డ్రాయింగ్ బ్రాంచ్(డీబీ)ను ప్రక్షాళన చేస్తూ నెల రోజుల క్రితం కమిషనర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కాంట్రాక్టు పనులకు సంబంధించిన అగ్రిమెంట్లు, టెండర్లు, పనుల ప్రతిపాదనల తయారీ, ఎంబీ రికార్డుల నమోదు తదితర పనులు ఈ విభాగంలో జరుగుతుంటాయి. ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇక్కడ విధులు నిర్వర్తించడంతో గతంలో పలు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యాన ఇటీవల కొత్తగా విధుల్లో చేరి, ఇంజనీరింగ్ విద్యనభ్యసించిన వార్డు ఆఫీసర్లను కమిషనర్ డీబీలో నియమించారు. వార్డు ఆఫీసర్లు రెగ్యులర్ ఉద్యోగులు కావడంతో ఉద్యోగ బాధ్యత, భద్రత ఉండడంతో అక్కడ ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావుండదని ఉన్నతాధికారులు భావించారు. కాని కొన్ని రోజులకే తొలగించిన సిబ్బందిని కొందరు అధికారులు మళ్లీ తిరిగి తీసుకొచ్చే ప్రయత్నాలు చేశారు. డీబీ విధుల పట్ల వార్డు ఆఫీసర్లకు ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే వారికి పని రావడంలేదనే సాకును చూపిన సదరు అధికారులు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని మళ్లీ డీబీలోకి తీసుకొచ్చారు. అధికారులకు ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై ఎందుకింత ప్రేమో అని కేఎంసీలో చర్చ జరుగుతోంది.

విధులకు ఎగనామం..?

కేఎంసీలో రెగ్యులర్ పీహెచ్ వర్కర్లు 92 మంది ఉన్నారు. వీరంతా క్షేత్రస్థాయిలో శానిటేషన్ పనులు చేయాల్సి ఉంది. అయితే రెగ్యులర్ కార్మికులు కొంతమంది విధులకు ఎగనామం పెట్టి సొంత పనులు చూసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. వీరికి కొంత మంది జవాన్లు, ఎస్ఐలు హాజరు నమోదు చేస్తున్నట్లు తెలిసింది.

ఓ మహిళ కార్మికురాలు సెలవు పెట్టకుండా అనారోగ్యంగా ఉందని ఆరేడు నెలలుగా తన స్థానంలో మరో వ్యక్తిని విధులకు పంపించింది. రెగ్యులర్ సిబ్బందికి ఇటువంటి వెసులుబాటు లేకున్నా.. సదరు కార్మికురాలికి హాజరు వేసి జీతం చెల్లించినట్లు తెలిసింది. ఇక ఇలానే మరి కొంత మంది విధులు నిర్వర్తించకుండానే హాజరు వేయించుకొని జీతాలు తీసుకుంటున్నట్లు సమాచారం. కార్మికులు విధులకు ఎగనామం పెడుతున్నా.. జవాన్లు, ఎస్ఐలు పట్టించుకోకపోవడం, పైస్థాయి అధికారులు ప్రశ్నించకపోవడం తీవ్ర ఆరోపణలకు తావిస్తోంది.

త్వరలో అక్రిడిటేషన్ల సమస్యకు పరిష్కారం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల అక్రిడిటేషన్ల సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమస్యలపై టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తగా అక్రిడిటేషన్ల జారీపై మార్గదర్శకాల రూపకల్పనకు ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఇచ్చిందని, దీని ఆధారంగా నిర్ణయం తీసుకోవడమేకాక జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు పొందిన యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లుతో పాటు మాటేటి వేణుగోపాల్‌రావు, మైనుద్దీన్, నలజాల వెంకట్రావు, మామిడాల భూపాల్‌రావు, జనార్దనాచారి, పసుపులేటి సత్యనారాయణ, చెరుకుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఎత్తిపోతలతో చెరువులకు సాగర్ జలాలు



సీఎం, మంత్రి తుమ్మల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

రఘునాథపాలెం: మండలంలోని చెరువులకు మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా సాగర్ జలాలు చేరుతున్నాయి. పథకం ట్రయల్ రన్‌ను సోమవారం ప్రారంభించగా.. మంచుకొండ డెలివరీ పాయింట్‌కు.. అక్కడి నుంచి మినీ పైప్‌లైన్ ద్వారా మంగళవారం బావోజీతండా చెరువుకు నీళ్లు వదిలారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం మార్కెట్ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ దీపక్, దొబ్బల సౌజన్య మాట్లాడుతూ.. నాలుగు నెలల్లోనే ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి, నీరు విడుదలయ్యేలా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అధ్యక్షుడు తాతా రఘురాంతో పాటు ధరావత్ రామ్మూర్తి, రెంటాల ప్రసాద్, దేవ్‌సింగ్, వాంకుడోత్ విజయ, తమ్మి నాగేశ్వరావు, భూక్యా గౌరిలాలు, మాలోత్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా, అఖిలపక్షం ఆధ్వర్యాన చేపట్టిన పోరాటాలతోనే చెరువులకు సాగర్ జలాలు విడుదల అయ్యాయని తెలంగాణ ఉద్యమకారుడు, కోటపాడుకు చెందిన నాగుల్ మీరా ఒక ప్రకటనలో తెలిపారు. అయితే, ప్రస్తుతం 20 శాతం భూములకే నీరు అందుతుందని, మిగిలిన 80 శాతం భూములకు నీరందేలా సాగునీటి వసతి కల్పించాలని కోరారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన గత ప్రభుత్వం తరహాలో ప్రస్తుత ప్రభుత్వం ఉండకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.4వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారితో కలిసి ఆయన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సుగుణ, ఖమ్మం టౌన్ అధ్యక్షుడు గద్దె వెంకటరామయ్యలతో పాటు ఎస్‌కె.రసూల్, కేతన బోయేన నాగయ్య, సతీష్ జానీపాషా తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంమామిళ్లగూడెం: కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

వేతనాలు ఇప్పించాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఈజీఎస్ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని, వేతనాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఈజీఎస్ ఉద్యోగులు కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. సకాలంలో వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరగా.. ఆదిశగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇక ఎండల తీవ్రత అధికంగా ఉందని, కార్యాలయం అద్దాలకు బ్లాక్‌ఫిల్మ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరగా ఏర్పాటు చేయిస్తానని కలెక్టర్ తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన కార్పొరేటర్

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై ఆ డివిజన్ కార్పొరేటర్ లకవత్ సైదులు నాయక్ మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిశారు. గోపాలపురంలో శిథిలావస్థలో ఉన్న బంజారా కమ్యూనిటీ హాల్‌ను పునర్నిర్మించాలని, వైఎస్ఆర్ నగర్, ఎల్బీనగర్, గోపాలపురం, కొత్త కాలనీ ప్రాంతాల్లో శ్మశానవాటికలు నిర్మించాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

మే డే వాడవాడలా నిర్వహించాలి

నేలకొండపల్లి: మేడే వేడుకలను వాడవాడలా నిర్వహించాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం మేడే పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను బీజేపీ సర్కార్ తూట్లు పొడుస్తుందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీసం వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలేరు ఏరియా కమిటీ నాయకులు పెద్దపాక వెంకన్న, పి.సాలయ్య, పెరుమాళ్ల పిచ్చయ్య, నాగేశ్వరరావు, వెంకటేష్, అంజి, రవి తదితరులు పాల్గొన్నారు.

కూలీల సమస్యల పరిష్కారంలో విఫలం

కూసుమంచి: వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సంఘం నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు, ప్రతాపనేని వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కూసుమంచిలో జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి నిధులను తగ్గిస్తూ వస్తుందని, దీంతో కూలీలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. కూలీలకు తగినన్ని పనిదినాలు కల్పించి వారికి ప్రతీ వారం వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై వచ్చే నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, నాయకులు చిట్టూరి వెంకన్న, నెల్లూరి వెంగళరావు, శ్రీనివాస్, బాబా, సత్యనారాయణ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థికి రూ.10వేల ప్రోత్సాహకం



రామ్‌చరణ్‌ను అభినందిస్తున్న డాక్టర్ సురేందర్

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు గ్రామానికి చెందిన బాలబోయిన రమేష్ కుమారుడు రామ్‌చరణ్ ఇంటర్ ఫస్టియర్‌లో 467 మార్కులు సాధించినందుకు గాను మంగళవారం నగరంలోని బ్రీత్ ఆస్పత్రి యాజమాన్యం అట్టి విద్యార్థిని అభినందించి రూ.10వేల ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపగాని సురేందర్ మాట్లాడుతూ.. తమ గ్రామానికి చెందిన, తన స్నేహితుడి కుమారుడు రామ్‌చరణ్ భవిష్యత్‌లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయలేక దూషణలు



సమావేశంలో మాట్లాడుతున్న పగడాల నాగరాజు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేక విఫలమై బీఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, పార్టీ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ రోజే ఇందిరమ్మ ఇళ్ల సర్వే అని, సభకు వెళ్తే పథకాలు రావని, రేషన్‌కార్డులు పోతాయని ప్రజలను ఇబ్బంది పెట్టినా సభకు తరలివచ్చి విజయవంతం చేశారన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పక్కన తిరిగిన నేతలే నేడు కాంగ్రెస్‌లోకి చేరి ఆయనపైనే విమర్శిస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మంజూరైన పనులను గత 16నెలలుగా నిలిపివేయడం తగదన్నారు. మున్నేరు భూ నిర్వాసితులకు పరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పువ్వాడపై విమర్శలు చేసే నేతలు కార్పొరేటర్ల పదవులకు రాజీనామా చేసి గెలిచి మాట్లాడాలని హితవుపలికారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు బుర్రి వెంకట్, పసుమర్తి రామ్మోహన్, జ్యోతిరెడ్డి, నాయకులు తాజుద్దీన్, బోజడ్ల రామ్మోహన్, ఎచ్చు ప్రసాద్, ఆరెంపుల వీరభద్రం, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జాబితాపై క్షేత్రస్థాయి విచారణ

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం మండల గెజిటెడ్ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించారు. మండలంలోని నాచేపల్లి, సుర్దేపల్లి తదితర గ్రామాల్లో ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు, ఆర్అండ్‌బీ ఏఈ పృథ్వి, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, ఇరిగేషన్ ఏఈ నరేష్, రుత్విక్‌రెడ్డిలు ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితా ఆధారంగా ప్రతీ ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిసరాలను పరిశీలిస్తున్నారు. అంతేకాక పరిసర ప్రాంతాల్లో లబ్ధిదారుల గురించి ఆరా తీస్తున్నారు. సర్వేను ఎంపీడీఓ ఎం.యర్రయ్య పర్యవేక్షిస్తున్నారు.



నాచేపల్లిలో సర్వే చేస్తున్న ఇరిగేషన్ ఏఈ రుత్విక్‌రెడ్డి

నేటి సమాచారం

● విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంఅర్బన్: నగరంలోని టౌన్- 2 పరిధి మమత రోడ్ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ లేన్ పనుల కారణంగా పాకబండబజార్, మైసమ్మ గుడి, మధురానగర్, మమత రోడ్ ఫీడర్ల పరిధిలో బుధవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ యాదగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మమత ఆస్పత్రి రోడ్, గొల్లగూడెం రోడ్, రాఘవయ్యనగర్, మధురానగర్, పువ్వాడనగర్‌తో పాటు ఖానాపురం సబ్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ డెయిరీ ఫీడర్, శ్రీనగర్ కాలనీ ఫీడర్, గోపాలపురం ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

● 'భూ భారతి'పై అవగాహన సదస్సు

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాలలో భూ సమస్యల పరిష్కానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి కార్యక్రమంపై బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, రైతులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

● పీపీటీ పరీక్షకు ముగియనున్న గడువు

ఖమ్మం సహకారనగర్: పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్(పీపీటీ) ఆధ్వర్యాన టీఎస్ యూటీఎఫ్ సహకారంతో వచ్చే నెల 5న 5, 6, 7వ తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టుకు నేడు(బుధవారం)తో గడువు ముగుస్తుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావులు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కోసం దరఖాస్తులు ఆన్‌లైన్ గూగుల్ ఫామ్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ లైట్ల బంద్ కనువిప్పు కావాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 30న (నేడు) రాత్రి 9 గంటల నుంచి 10 నిమిషాల పాటు ఇళ్లు, వాణిజ్య సముదాయాల్లో విద్యుత్ లైట్లను స్వచ్ఛందంగా నిలిపి కేంద్రానికి కనువిప్పు తేవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. తక్షణమే వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ మంగళవారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఖమ్మం జిల్లా యూనిట్ ఆధ్వర్యాన ఖమ్మం టీఎన్జీఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ భూములను సాధారణంగా మసీదుల నిర్మాణం, శ్మశానవాటికలు, మదర్సాలు, ఆస్పత్రులు, విద్యాసంస్థల నిర్మాణం తదితర ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు మాత్రమే వాడుకునే అవకాశం ఉందని కూడా వారు గుర్తు చేశారు. వక్ఫ్ చట్టం రద్దు కోసం అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకమై ఐక్యన్యాయ పోరాటాలతో తమ హక్కులు సాధించుకుంటామని కేంద్రాన్ని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఖమ్మం జిల్లా సభ్యులు మౌలానా మొహమ్మద్ సయీద్ అహ్మద్ ఖాస్మి, ఇల్యాస్, అజహరుద్దీన్, షేక్ అబ్దుల్ రషీద్, సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్)జిల్లా కార్యదర్శి గోగినెపల్లి వెంకటేశ్వర్లు, ఎంఎల్ పార్టీ కార్యదర్శి మధు, సేవాలాల్ సేన అధ్యక్షుడు కిషన్ నాయక్, మాల మహానాడు అధ్యక్షులు కొట్టే సుధాకర్, ముఫ్తీ జలాలుద్దీన్ ఖాస్మీ, ముహమ్మద్ సాదిక్, మొహమ్మద్ అసద్, జైనుల్ అబిదీన్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సీఎం కప్ బహుమతుల ప్రదానం

ఖమ్మం స్పోర్ట్స్: అట్టహాసంగా సీఎం కప్ క్రీడోత్సవాలు నిర్వహించిన అధికారులు బహుమతులను మాత్రం నాలుగు గోడల మధ్య ఇవ్వడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. సీఎం కప్ క్రీడోత్సవాలు నిర్వహించే సమయాన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో వారం రోజుల పాటు సంతాపదినాలు ప్రకటించడంతో విజేతలకు బహుమతులు ఇవ్వలేదు. ఈమేరకు జిల్లా జట్టు ఫుట్‌బాల్ విజేతగా నిలవడంతో రెండు రోజుల క్రితం బహుమతులు తీసుకునేందుకు హైదరాబాద్ రావాలని రాష్ట్ర ఒలింపిక్ సంఘం బాధ్యులు సూచించారు. దీంతో ఉత్సాహంగా వెళ్లగా సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో పతకాలు, సర్టిఫికెట్లు ఇచ్చి పంపించారు. ఈ మేరకు సీఎం లేదా మంత్రుల చేతుల మీదుగా అందుకోవచ్చని భావించిన క్రీడాకారులు నిరాశగా వెనుదిరిగారు.

అక్రమ కట్టడాలు తొలగించిన అధికారులు



అక్రమ కట్టడాలను కూల్చివేయిస్తున్న అధికారులు

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండా పరిధి 142 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా నిర్మించిన కట్టడాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు కావాలనే పేదలను ఉసిగొల్పి అక్రమ నిర్మాణాలు చేయిస్తున్నారని, ఈ విషయంలో దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేలా సర్వే నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, రెవెన్యూ, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా నాయీబ్రాహ్మణ నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక నూతన కమిటీని మంగళవారం తెలంగాణ రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్రస్థాయి నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మం నాయీబ్రాహ్మణ కాలనీ బుర్హాన్‌పురంలో కమిటీని ఎన్నుకోగా.. అధ్యక్షుడిగా తూముల నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా ఆలేటి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా ఆలేటి వెంకటప్పయ్య, గౌరవ సలహాదారుడిగా లింగంపల్లి అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గుంటి సురేష్, గుండెమెడ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా గొల్లపూడి వీరన్న, జాయింట్ సెక్రటరీగా నాగవెల్లి రామచందర్ ఎన్నికయ్యారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి శ్రీగంగుల శ్రీనివాస్‌నాయుడు వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కందుల సూర్యనారాయణ, రాష్ట్ర ఐక్య వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్, ఆర్టీఏ డైరెక్టర్ గజ్జెల్లి వెంకన్న, ఖమ్మం జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు మాదారపు హరినాథ్, సభ్యులు దేవరకొండ శ్రీనివాస్, కుదురుపాక శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు